క్లుప్తంగా

రేపటి నుంచి పోలేరమ్మ జాతర



విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి ఆలయం

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు పోలేరమ్మ జాతర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. జాతర సందర్భంగా ఆలయానికి రంగులద్ది, చలువ పందిళ్లువేశామన్నారు.అలాగే విద్యుద్దీపాలతో అలంకరించామన్నారు.చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి రానుండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎడ్ల బండ లాగుడు, రాతి గుండు ఎత్తటం, బైక్ స్లో రేస్, ఇసుక బస్తా ఎత్తడం, ట్రాక్టర్ రివర్స్ నడపడం తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

తెలుగు సంవత్సర క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక టెక్కె భరత మాత ఆలయంలో మంగళవారం నూతన తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను వీహెచ్‌పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వైఎస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, భజరంగదళ్ రాష్ట్ర కో కన్వీనర్ పోలపల్లి సందీప్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు చోరీ



మోటార్ వద్ద విద్యుత్ తీగ చోరీకి గురైందని చూపుతున్న రైతు

రుద్రవరం: మండల పరిధిలోని చిత్రేనిపల్లె గ్రామ పరిసరాల్లో 25 బోరుమోటర్ల వద్ద మంగళవారం తెల్లవారు జామున విద్యుత్ తీగలు చోరీ కి గురయ్యాయి. గ్రామ పంచాయతీకి చెందిన బోరుమోటార్ విద్యుత్ తీగ కూడా చోరీకి గురైంది. సర్పంచు గుండా వరలక్ష్మితో పాటు బాధిత రైతులు క్రిష్ణయ్య, జయరాముడు, బాలగురప్ప, మాబుపీరా, వెంకటేశ్వర్లు, పెద్ద నాగయ్య, పెద్ద క్రిష్ణయ్య తదితరులు మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం ఇలాగే 35 బోరుమోటార్ల వద్ద విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయన్నారు. ఒక్కో బోరు మోటార్ వద్ద 40 మీటర్ల విద్యుత్ తీగ ఉంటుందని, ఆ తీగ ఒక్కో మీటర్ రూ.100లని అన్నారు. దొంగతనం జరిగిన ప్రతిసారి ఒక్కో రైతు రూ.5 వేల నుంచి రూ.6 వేల చొప్పున నష్టపోతున్నారన్నారు. పోలీసు లు నిఘా పెంచి విద్యుత్ తీగల చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉగాది ఉత్సవాలకు మహానంది ముస్తాబు

మహానంది: ఉగాది ఉత్సవాలకు మహానంది ఆల యం ముస్తాబైంది. ఉగాది పర్వదినం సందర్భంగా మహానందిలో బుధవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ రాజగోపురం, మహాద్వారం, సుపథ మండపాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామి,అమ్మవార్లకు విశేష, అభిషేక అర్చనలతో పాటు తిరుమంజనం, పంచాంగశ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ ఉంటుందని వేదపండితులు రవిశంకర అవధాని చెప్పారు. బుధ, గురువారాల్లో నిరంతరదర్శనం ఉంటుందని తెలిపారు.

షడ్రుచుల వేడుక ఉగాది

- ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు
- పలు ఆలయాల్లో ఉగాది పంచాంగ శ్రవణ ఏర్పాట్లు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ ప్రజలు ఉగాది ఉత్సవాలకు సిద్ధమయ్యారు. పులుపు, కారం, తీపు, వగరు, ఉప్పు, చేదు (షడ్రుచులు) కలయికే ఉగాది. తెలుగు సంవత్సరం శోభకృత్‌నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం రంగులు చల్లుకొని సంబరాలు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకన్నారు.ఆలయాలను కూడా నిర్వాహకులు ముస్తా బు చేశారు. పూజలు, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు తదితర కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.

ముస్తాబైన ఆలయాలు..
పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలోని కోదండ రామాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంజనేయస్వామి ఆలయం, మెయిన్‌బజార్‌లోని సుంకులమ్మ ఆలయం, ఉప్పరిపేటలోని సుంకులమ్మ ఆలయాలు అమ్మవారి, నాగులకుంట రోడ్డు, బొమ్మలసత్రంలోని షిర్డీసాయిబాబా ఆలయాల నిర్వాహకులు ఉగాది వేడుకలకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారీకేడ్లు, పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు.

పూజా సామగ్రి కొనుగోలు
పూజకు అవసరమైనటువంటి అరిటాకులు, మామిడాకులు, మామిడి పూత, మామిడి కాయలు, వేపపూత, అరటి ఆకులు, పూలు, పండ్లను కొనుగోలు చేయడానికి ప్రజలు భారీ సంఖ్యలో రావడంతో గాంధీచౌక్ కిక్కిరిసి పోయింది. సంజీవనగర్, టెక్కె, మార్కెట్‌యార్డు, సాయిబాబానగర్ ఆర్చి తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం



ముస్తాబైన బైటిపేట ఆంజనేయస్వామి గుడి

పంచాంగ శ్రవణం..
ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సంజీవనగర్ రామాలయం, బ్రాహ్మణ సంఘం, ఎస్‌బీఐ కాలనీ రామాలయం, బైటిపేట ఆంజనేయస్వామి ఆలయాల్లో, రామకృష్ణ డిగ్రీ కాలేజీలో, వివేకానంద ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నారు.

మంచికి శ్రీకారం..
వ్యాపారులు తమ వ్యాపారం అభివృద్ధి చెందడం కోసం దస్కం పూజలు, వేసవి కాలం రావడంతో చలివేంద్రాల ఏర్పాటు, ఉగాది రోజు వసంతోత్సం నిర్వహించుకుంటూ బ్రాహ్మణులకు గొడుగులు, చెప్పులు, విసన కర్రలు, వస్త్రాలు దానం చేస్తారు. ఇలా దానం చేయడం వల్ల తమ వంశాభివృద్ధి చెందుతుందని భక్తుల నమ్మకం. ఉదయమే ఉగాది పచ్చళ్లు ఆరగించడం ఆనవాయితీ. సంవత్సరమంతా మంచి అభివృద్ధి చెందుతారని నమ్మకం.

అత్యంత శోభనిచ్చే సంవత్సరం

శోభకృత్‌నామ సంవత్సరం అంటే అత్యంత శోభనిచ్చే సంవత్సరం అని, వర్షాలు బాగా కురిసి పంటలు పండుతాయని, రాజులు పరస్పరం స్నేహం కలిగి ఉంటారని అర్థం. ప్రజల అభిప్రాయం ప్రకారం పరిపాలన జరుగుతుంది. ఈ సంవత్సరం ఆరు గ్రహాలు బాగా ఉండటం వల్ల అభివృద్ధి జరుగుతుంది.

– డాక్టర్ హయగ్రీవాచార్యులు, విశ్రాంత సంస్కృత అధ్యాపకుడు

అభినందనలు

నంద్యాల(అర్బన్): జిల్లా మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొరటమద్ది జ్ఞానసుందరాన్ని పలువురు అభినందించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సేవా స్తంబ్ రాష్ట్ర కార్యదర్శి సత్యం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఉద్యోగులు డేవిడ్, శ్రీధర్ తదితరులు జ్ఞానసుందరాన్ని అభినందించారు.

క్షేత్రపాలకుడికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకుడిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు.

శాస్త్రోక్తంగా అమావాస్య ఉత్సవం

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. మూలమూర్తులను శుప్రభాత సేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్య పూజలతో పాటు అమావాస్య పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదులను మొదటి పీఠాధిపతి ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్ ఉత్సవమూర్తిని ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి నవకలశాలతో పంచామృతాభిషేకం పసుపు, చందనం వంటి లేపనాలు సమర్పించి దూపదీపాలతో మహామంగళ హారతి అందించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో విశేష అలంకరణగావించిన ఉత్సవ పల్లకీని అధిష్టించి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సామ్యానారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు



ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నంద్యాల(అర్బన్): భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి ఆదేశించారు. వచ్చే డిసెంబర్‌లోగా అన్ని గ్రామాలకు సంబంధించిన సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. స్థానిక నిశాంత్ భవన్‌లో మంగళవారం జగనన్న భూహక్కు–భూరక్షణ పథకం రీసర్వేపై నంద్యాల డివిజన్ వీఎపీ, వీఆర్‌ఓ, ఆర్‌ఐలు, మండల సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నిశాంతి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఐఎస్ ఏడీ శ్రీరామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిశాంతి

అన్నదానం

నంద్యాల(వ్యవసాయం): వాసవీక్లబ్ సభ్యులు లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పరివర్తన లైఫ్ సెంటర్,బుడగజంగాల బాలబాలికల వసతి గృహంలో మంగళవారం అన్నదానం చేశారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర పొలిటికల్ వైస్ చైర్మన్ ఖండే శ్యాంసుందర్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



రుద్రవరం: చిరుధాన్యాలతో తయారు చేసిన వంటలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: చిరుధాన్యాల వంటలతో గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయంలో మంగళవారం వారు పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిరు ధాన్యాల ఎంపిక, వాటితో వంట చేసుకోవడంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నివారించుకోవడంతో పాటు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు.

☛ **ఉయ్యాలవాడ:** పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఫకూర్‌బీ, రాజేశ్వరమ్మ, గురులక్ష్మి గర్భిణులకు, బాలింతలకు సూచించారు. స్థానిక 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. రాగులు, కొర్రలు, జొన్నలు, పెసలు, అలచందలు, గోధుమలు, కందులు, మునగ వంటి చిరు ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే బిడ్డ ఎదుగులకు ఎంతో దోహదపడుతుందని వారు వివరించారు.

25 నుంచి ఆసరా వారోత్సవాలు

శిరివెళ్ల: ఈనెల 25వ తేదీ నుంచి ఆసరా వారో త్సవాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంతి పథం ఆళ్లగడ్డ క్లస్టర్ కోఆర్డినేటర్ దానం తెలిపా రు. మంగళవారం ఏపీఎం పుణ్యవతితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. డ్వాక్రా మహిళల 3వ విడత రుణమాఫీ నిధులను 25న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాలకు జమ చేస్తారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 3,444 డాక్రా సంఘాలకు రూ. 20.80 కోట్ల రుణమాఫీ నిధులు మంజూరవుతాయన్నారు. ఆళ్లగడ్డ మండలంలో 454 సంఘాలకు రూ.2.92 కోట్లు, దొర్నిపాడులో 347 సంఘాలకు రూ.1.93 కోట్లు, శిరివెళ్లలో 972 సంఘాలకు రూ.8.31 కోట్లు, రుద్రవరంలో 662 సంఘాలకు రూ.4.59 కోట్లు, చాగలమర్రి మండలంలో 318 సంఘాలకు రూ.1.63 కోట్లు, ఉయ్యాలవాడ మండలంలో 291 సంఘాలకు రూ.1.45 కోట్ల రుణమాఫీ నిధులు మంజూరవుతాయన్నారు.

పన్ను వసూళ్లలో లక్ష్యాలను సాధించాలి

- డీపీఓ శ్రీనివాసులునాయుడు

గోస్పాడు: గ్రామ పంచాయతీ పరిధిలో పన్ను వసూళ్లలో లక్ష్యాలను సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు నాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్, వాటర్, సంత మార్కెట్ల నుంచి పన్నులను వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. హౌసింగ్ పన్ను లక్ష్యం రూ.9.24 కోట్లు కాగా ఇప్పటికే రూ.6.74 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. నాన్ ట్యాక్స్ లక్ష్యం రూ.8.05 కోట్లు కాగా అందులో రూ.5.87 కోట్లు వసూలు లక్ష్యాలను 73 శాతం సాధించినట్లు చెప్పారు. సిబ్బంది గ్రామాల పరిధిలో మిగిలిపోయిన పనులను కూడా వేగవంతంగా వసూలు చేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. స్పందనకు వచ్చే దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. దరఖాస్తులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. ఎండా కాలం ప్రారంభమైందని, గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం చేయాల్సిన పనులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సమావేశంలో ఈఓఆర్‌డీ నాగేంద్రుడు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి
దొర్నిపాడు: గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని క్రిష్టిపాడు, గుండుపాపల గ్రామాల్లోని చెత్తసంపద కేంద్రాలను పరిశీలించారు. సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇంటి, నీటి పన్నుల వసూలుపై ఆరా తీశారు. ఈనెలాఖరులోగా పన్నుల వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ నాగఅనసూయ, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, సర్పంచులు శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



క్రిష్టిపాడులో చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: ఆత్మకూరు ఏపీఎస్ ఆర్‌టీసీ డిపో నుంచి ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలమహాక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలానికి 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాల్లోని ఆదోని, ఎమ్మిగనూరు,. కర్నూలు, నందికొట్కూరు, నంద్యాల తదితర డిపోల నుంచి 260 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతేడాది 220 బస్సులు నడిపామని ప్రస్తుతం మరో 40 బస్సు సర్వీసులను అదనంగా కేటాయించినట్లు వెల్లడించారు. వివిధ డిపోల నుంచి ఈ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. కర్ణాటక భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుమారస్వామికి విశేషపూజలు
శ్రీశైలంటెంపుల్: స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

రాగి జావలో పోషకాలు మెండు

రుద్రవరం: రాగి జావలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి అన్నారు. రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించి ప్రసంగించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లింగం బ్రహ్మయ్య పాల్గొన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ఎంపీపీ బాలస్వామి పాల్గొని విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేశారు. అలాగే పలుగ్రామాల్లోని పాఠశాలల్లో ఆయా గ్రామాల సర్పంచులు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

☛ **శిరివెళ్ల:** స్థానిక మోడల్ స్కూల్‌లో ఎంపీపీ నాయక్ వసీం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పాల్గొన్నారు.

☛ **ఉయ్యాలవాడ:** స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగిజావను జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవితో కలిసి ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, హెచ్ఎం మహబూబ్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

☛ **దొర్నిపాడు:** మండల పరిధిలోని గుండుపాపల పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతలారెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్ తదితరులు రాగిజావ పంపిణీ చేశారు. క్రిష్టిపాడు గ్రామంలో డీపీఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ నాగఅనసూయలు పాల్గొని విద్యార్థులకు రాగిజావను అందజేశారు.

☛ **ఆళ్లగడ్డ:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ వైస్‌చైర్‌మెన్ నాయబ్‌రసూల్, చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీపీ వీరభద్రుడు విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆళ్లగడ్డ, చాగలమర్రి తహసీల్దార్లు హరినాథరావు, విజయ్‌కుమార్, ఎంపీడీఓలు సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, ఎంఈఓలు శోభావివేకవతి, అనురాధ పాల్గొన్నారు.



రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తున్న దృశ్యం

రాగిజావతో విద్యార్థులకు పౌష్టికాహారం
గోస్పాడు: రాగిజావతో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని ఎంఈఓ అబ్దుల్‌కరీం అన్నారు. మంగళవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఇప్పటికే నాణ్యతతో కూడిన భోజనం పెడుతున్నామన్నారు. పేద విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాగి జావాను కూడా అందిస్తున్నట్లు చెప్పారు.



రాగిజావను అందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయ సిబ్బంది

☛ **నంద్యాల(సిటీ):** పట్టణంలోని సాధిక్ నగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా రాగిజావ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రాగి జావాను అందించడం హర్షణీయమన్నారు.